# గుక్కెడు నీటికి తిప్పలు

- బోరు మోటర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు
- మిషన్ భగీరథ నీరు రాక తిప్పలు
- పట్టించుకోని పంచాయతీ సెక్రటరీ, ప్రత్యేకాధికారి
- నీటి కష్టాలను తీర్చాలంటున్న తండాలవాసులు


పొలంలో నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

నర్సాపూర్, ఏప్రిల్ 28: గుక్కెడు నీటి కోసం గిరిపుత్రులు అలమటిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రాక పొలాల్లోని బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మండలంలోని ఎల్లారెడ్డి గూడా తండా పంచాయతీతో పాటు దీని పరిధిలోని మూడు తండాలు జైరాంతండా, హచ్చుతండా, ప్రేమ్‌నగర్‌తండా ప్రజలు నీటి కష్టాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ తండాల్లో మిషన్ భగీరథ ద్వారా పుష్కలంగా నీళ్లు వచ్చేవి. కాని నేడు పరిస్థితి దారుణంగా మారింది. మిషన్ భగీరథ నీరు సరిగ్గా రాకపోవడంతో తండాలు నీళ్ల కోసం పొలాల బాట పటాయి. మహిళలు, పిల్లలు తండాలకు సమీపంలోని పొలాల వద్ద గల బోరు మోటర్ల నుంచి నీటిని మోస్తున్నారు. పంచాయతీ సెక్రటరీకి, ప్రత్యేకాధికారికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పందించడం లేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. తండాల్లో నీటి ఎద్దడి ఉన్నప్పటికీ కనీసం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడం, పాడైపోయిన మోటర్లను బాగుచేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. శ్మశానవాటిక దగ్గర బోరు మోటర్ ఉన్నప్పటికీ బాగు చేయించడం లేదని వాపోయారు. జైరాంతండాలో, హచ్చుతండాలో సింగిల్ ఫేజ్ మోటర్ పాడైపోయినా రిపేర్ చేయించడం లేదు.

### సెక్రటరీకి చెప్పినా పట్టించుకోవడం లేదు



తండాల్లో నీటికి ఇబ్బంది అవుతుందని పంచాయతీ సెక్రటరీకి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. కనీసం సింగిల్ ఫేజ్ మోటర్లను బాగుచేయడానికీ ముందుకొస్తలేరు. మహిళలు, పిల్లలు పొలాల గట్లపై వెళ్తూ నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలుగు తండాల్లో నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నా.

**- బిక్యానాయక్, తండావాసి**

### తండాల్లో నీటి సమస్య వాస్తవమే

ఎల్లారెడ్డిగూడ తండా పంచాయతీ పరిధిలోని గిరిజన తండాల్లో నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. పంచాయతీ సెక్రటరీ వారి బంధువులు ఒకరు చనిపోయారని సెలవు పెట్టారు. సెక్రటరీ రాగానే తండాల్లో నీటి సమస్య పరిష్కరిస్తాం.

**- గ్రామ ప్రత్యేకాధికారి వైద్య శ్రీనివాస్ (ఎంపీవో)**

## వేసవిలో దొంగలతో జాగ్రత్త: ఎస్పీ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28: వేసవిలో దొంగలతో జాగ్రత్తగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయని పెండ్లిలు, ముహూర్తాలు, స్నేహితులు, ఫ్యా మిలీతో టూర్ ప్లాన్ చేస్తూ ఉంటారన్నారు. ఇంటి బయట డాబాలపైన పడుకునేవారు నగలను జాగ్రత్తగా పెట్టుకోవాలని, ఇంట్లో బంగారు ఆభరణాలు ఉంచవద్దని సూచించారు. ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు.

## నేడు బార్ అండ్ రెస్టారెంట్ల కేటాయింపు


శ్రీనివాస్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 28: నేడు కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో బార్ అండ్ రెస్టారెంట్లను లాటరీ ద్వారా కేటాయించనున్నట్లు జిల్లా ప్రొబిహిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మూడేండ్లుగా మూతబడి ఉన్న బార్ అండ్ రెస్టారెంట్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చామని, దీంతో 20 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ నగేశ్ అధ్యక్షతన ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా కేటాయించనున్నట్లు తెలిపారు.

## బాల పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ రూరల్, ఏప్రిల్ 28: ప్రధానమంత్రి బాల పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని మహిళా శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి హైమావతి ప్ర కటనలో తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శా ఖ ఆధ్వర్యంలో పీఎం రాష్ట్రీయ బాల పురస్కారాలకు అర్హులైన చిన్నారులు జూ లై 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చే సుకోవాలని పేర్కొన్నారు. 6 నుంచి 18 ఏండ్ల లోపు బాలబాలికలు వివిధ రంగాల్లో ఆవిష్కరణలు, సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతిక కళలు, సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర, సాంకేతిక, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాలబాలికలు https://awards.gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


శేఖులు (ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్ 28: కుటుంబ కలహాలతో ఇంట్లో గొడవపడి వెళ్లిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కోట కింది వాడకు చెందిన ముల్క శేఖులు (55) పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా రోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. ఆదివారం రాత్రి కూడా తాగి ఇంటికి వచ్చాడు. దీంతో అతడి భార్య సునీత తాగి వస్తే ఎలా అని అడగడంతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. 9.30 గంటలకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో సునీత, ఇద్దరు కుమారులు వెతికినా కనిపించలేదు. సోమవారం ఉదయం వెల్దుర్తి పాత గ్రామ పంచాయతీ భవనం లోపల చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కొడుకు ఆనంద్, తల్లికి తెలిపాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

## చెరువులో నీట మునిగి విద్యార్థి మృతి


హర్షవర్ధన్ (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 28: నీటి మునిగి యువకు డు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని బీ కొండాపూర్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ చదువుతున్న బుర్కా హర్షవర్ధన్ (17) గ్రామంలోని తన కులస్తుల దశ దినకర్మకు హాజరయ్యాడు. పెద్ద చెరువు లో స్నానాలు చేస్తున్న సమయంలో హర్షవర్ధన్ నీటి మునిగి, అపస్మారక స్థితికి చేరాడు. దీంతో నార్సింగిలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు మృతుడి తండ్రి బుర్కా రాజు తెలిపాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పో స్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభు త్వ దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

## కరీంనగర్‌లో ఉరేసుకుని యువకుడు మృతి

చేగుంట, ఏప్రిల్ 28: మండలంలోని కరీంనగర్‌లో గ్రామానికి చెందిన వడ్డె హరి(21) సోమవారం హైటెన్షన్ టవర్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హరి మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు, మృతుడి తండ్రి వడ్డె రాములు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

## డీసీఎంలో కలప అక్రమంగా తరలింపు


కలపతో స్వాధీనం చేసుకున్న డీసీఎం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 28: డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న కలపను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ తెలిపారు. కౌడిపల్లి మండలానికి చెందిన వినోద్, టేక్మాల్ మండలం ఎల్లూపేట నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న కలపను పెద్దశంకరంపేట శివారులో స్వాధీనం చేసుకున్నారు. వినోద్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అధికారి తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రామాయంపేటలోని ఓ రిసార్ట్‌లో కలిసిన పూర్వ విద్యారులు, గురువులు

రామాయంపేట, ఏప్రిల్ 28: రామాయంపేట జడ్పీహెచ్‌ఎస్‌లో 2006-07 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఒక రీసార్ట్‌లో కలుసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించి, గత అనుభవాలను పంచుకున్నారు. గురువులు దేవేందర్, సురేశ్, ఏగౌండ, చక్రవర్తి, శ్రీనివాస్, సత్యరాములును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యశ్వంత్, శివకుమార్‌గౌడ్, అజార్, వెంకటసాయికుమార్, వికాస్, ప్రసాద్, శివ ప్రసాద్, ఎండీ.కలీం తదితరులు ఉన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత


బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న గ్రామ యువకులు

రామాయంపేట, ఏప్రిల్ 28: ఝాన్సీలింగాపూర్‌కు చెందిన కొమ్ము జీవన్ అనారోగ్యానికి గురై కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొందాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో బాధిత కుటుంబానికి రూ.24 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. దీన్ని సోమవారం గ్రామ యువకులు బాధిత కుటుంబానికి అందజేశారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, ఏప్రిల్ 28: నస్కల్‌కు చెందిన కల్పన అనారోగ్యంతో ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందింది. రూ.54 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. మాజీ సర్పంచ్ జలేందర్, నాయకుడు లింగంగౌడ్ బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి


మెదక్ మున్సిపాలిటీ: ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్


మెదక్ అర్బన్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

**- అదనపు కలెక్టర్ నగేశ్**

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 28: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో జిల్లాలోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను డీఈవో రాధాకిషన్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో 58 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో భూ భారతి సంబంధించినవి 4, ఎంప్లాయిమెంట్ 4, ఇందిరమ్మ ఇండ్లకు 6, పింఛన్లకు 1, ఇతర సమస్యల కోసం 33 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

### అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి: అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని అదనపు ఎస్పీ మహేందర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

## మిల్లుకు చేరిన ఆరు గంటల్లో అన్‌లోడ్ చేయాలి


కొల్చారం: మిల్లులో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్ రెడ్డి


రామాయంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రజినీకుమారి


నిజాంపేట: నస్కల్‌లో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏవో సోమలింగారెడ్డి

రామాయంపేట, ఏప్రిల్ 28: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. సోమవారం పట్టణంతో పాటు డీ.ధర్మారం తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు, దళారులకు ధాన్యం విక్రయించి మోసాలకు గురికావద్దని రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం అన్నారు. పట్టణంలోని హరిజన కాలనీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు.

**కొల్చారంలో..**

కొల్చారం, ఏప్రిల్ 28: కొల్చారంలోని సత్యసాయి రైస్ మిల్లును నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మిల్లుకు వచ్చిన ధాన్యం నిల్వలు పరిశీలించారు. లేబర్ కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ధాన్యం మిల్లుకు వచ్చిన ఆరు గంటల్లోగా అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ గఫర్ మి యా, ఆర్ఐ ప్రభాకర్, సిబ్బంది, మిల్లు యజమాని ఉన్నారు.

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి**

నిజాంపేట, ఏప్రిల్ 28: కొనుగోలు కేంద్రాలకు తరలించే ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏవో సోమలింగారెడ్డి రైతులకు సూచించారు. చల్మెడ, నస్కల్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఆయన వెంట ఏఈవో శ్రీలత, కేంద్రాల నిర్వాహకులు రాజు, కనుకరాజు ఉన్నారు.

## ఏడుపాయల హుండీ ఆదాయం లెక్కింపు


హుండీని లెక్కిస్తున్న భక్తులు

పాపన్నపేట, ఏప్రిల్ 28: ఏడుపాయల వన దుర్గా భవానీమాత ఆలయ హుండీ ఆదాయం రూ.46లక్షల 8వేల 354 వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రస్టు ఈవో రాంగోపాల్, ఆలయ ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్ వెల్లడించారు. సోమవారం గోకుల్ షెడ్‌లో 58 రోజుల హుండీ లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్యామ్, శ్రీనివాస్ శర్మ, రాజు, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఎంఈవోతో ఆత్మీయ సమ్మేళనం

కొల్చారం, ఏప్రిల్ 28: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఎంఈవో నీలకంఠంతో అతడు పని చేసిన 9 మండలాలకు చెందిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగస్తులు సోమవారం హవేళీఘనపూర్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కో ఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ నీలకంఠం కొల్చారం మండలంలో 12 ఏండ్లు సుదీర్ఘ కాలం పనిచేశారని గుర్తుచేశారు. మండల విద్యాధికారిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజశేఖర్, సీఆర్పీలు సాయికుమార్, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రామాయంపేట, ఏప్రిల్ 28: మండలంలోని డీ.ధర్మారం గ్రామానికి చెందిన గఫూర్(45) వారం రోజుల క్రితం బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి టెన్త్ క్లాస్ మిత్రులు మృతుడి భార్య సల్మాకు రూ.11 వేల నగదు అందించారు.

## విద్యుత్ తీగలు సరిచేయాలి



నర్సాపూర్, ఏప్రిల్ 28: గొల్లపల్లి గ్రామ సమీపంలోని రహదారి పక్కన విద్యుత్ తీగలు చేతికి అందేలా కిందికి వేలాడుతున్నాయి. ఈ తీగలతో ప్రమాదం పొంచి ఉందని రైతులు, వాహనదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతు రాజుగౌడ్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

## వెలుగు చూడని పాలక వర్గ నోటిఫికేషన్

పాపన్నపేట,ఏప్రిల్ 28: దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించలేదు అన్న చందంగా ఉంది ఏడుపాయల ఈవో వ్యవహారం. ఏడుపాయల పాలక మండలి పదవీ కాలం ముగిసి ఏడాది దాటినా కొత్త పాలక మండలి ఏర్పాటు కాలేదు. ఈ మధ్య ఒకసారి నోటిఫికేషన్ వేసినా పాలక మండలి ఏర్పాటుకు నోచుకోలేదు. ఇటీవల కాంగ్రెస్‌లో కొత్త పాలక మండలి ఏర్పాటుపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఈనెల 22న కొత్త పాలక మండలి ఏర్పాటు కోసం కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 20 రోజుల లోపు ఔత్సాహికులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి, ఈ నోటిఫికేషన్‌ను స్థానికంగా ఒక దినపత్రికలో ప్రచురించాలి, స్థానిక పంచాయతీ, ఈవో కార్యాలయం వద్ద నోటిఫికేషన్ కాపీ అంటించి ప్రచారం కల్పించాల్సి ఉంది. కానీ, స్థానిక ఆలయ అధికారులు ఆరు రోజులు గడిచినా ఇప్పటి వరకూ బయటపెట్టలేదు. ఈ విషయమై ఈవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా పత్రికా ప్రకటన అనుమతి కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశామన్నారు. మంగళవారం పత్రికలో ప్రకటన విడుదల చేసి, స్థానిక పంచాయతీ, తహసీల్దార్,ఎంపీడీవో కార్యాలయాల వద్ద ప్రతులు ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

## రాజశేఖర్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు




రామాయంపేట, ఏప్రిల్ 28: తన శక్తి మేర విద్యార్థులు, నిరుపేదలకు సేవలు అందిస్తున్న లయన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు దక్కింది. రాజశేఖర్‌రెడ్డి 35ఏండ్లుగా చేస్తున్న సేవలకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో అంతర్జాతీయ ప్రెసిడెంట్ లీడర్‌షిప్ మాడల్ అవార్డును అందజేశారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి

చేగుంట, ఏప్రిల్ 28: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు బలోపేతమైనప్పుడే ఉన్నత పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ పేర్కొన్నారు. చేగుంటలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించాలని, బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, మధ్యాహ్న భోజన పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరంలో శిక్షణ తరగతు లు నిర్వహించరాదన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమా వేశంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, చక్రవర్తి, రాజేశ్వర్, జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

చేగుంట, ఏప్రిల్ 28: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విదానాలను ఉపసంవరించుకోవాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన అధ్యక్షుడు ఇదారి మల్లేశం పేర్కొన్నారు. చేగుంటలో సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమ బీడీ పరిశ్రమ, దాదాపు 7.80 లక్షల మంది కార్మికులు వివిధ కేటగిరీల్లో పని చేస్తున్నారన్నారు. ఏప్రిల్ నుంచి కరువు భత్యం వెయ్యి బీడీలకు కలుపుకొని 261.97 పై యాజమాన్యాలు కార్మికులకు చెల్లించాలన్నారు. నెలసరి ఉద్యోగులకు 312.00లు చెల్లించాలని, ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న వర్ధి బీడి కంపెనీలు ఏటా రెండు, మూడు నెలలుగా చెల్లించడంలేదన్నారు. ఈ విషయమై లేబర్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేసినా, వారిపై చర్య లు తీసుకోవడంలేదని ఆరోపించారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మల్లేశం కోరారు.

## బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు: మాజీ ఎమ్మెల్సీ



మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 28: ఎల్కతుర్తి బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు మెదక్ ని యోజక వర్గంలోని ప్ర తి గ్రామం నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలకు మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### సబ్ జైల్‌ను తనిఖీ చేసిన న్యాయమూర్తి


మాట్లాడుతున్న కార్యదర్శి శుభవల్లి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28: జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి ఆర్ఎమ్ శుభవల్లి సోమవారం తనిఖీ చేశారు. ఖైదీలకు మోనూ ప్రకారం ఆహారం అందించాలని జైల్ అధికారులకు సూచించారు. ఖైదీల ఆరోగ్యం వారి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

**బాలసదనంలో తనిఖీ**

జిల్లా కేంద్రంలోని స్టేడియం వద్ద ఉన్న బాలసదనంను ఆయన తనిఖీ చేశారు. బాలసదనంలోని పిల్లల చదువు, ఆరోగ్యం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వంటశాల తనిఖీ చేసి ఆహారం గురించి సంబంధిత అధికారులకు సూచించారు.

### హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 28: గ్రామీణ ప్రాంతాల పురుషులకు హౌస్ వైరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణా కేంద్రం డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి, 18 నుంచి 45 ఏండ్ల వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో సంగారెడ్డి స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. లేదా 9704446956, 9490129839 నంబర్లకు వాట్సాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి మే 8వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

### మాజీ ఎంఈవోకు సన్మానం



పాపన్నపేట, ఏప్రిల్ 28: పాపన్నపేట మాజీ ఎంఈవో నీలకంఠం ఈ నెలాఖరులోగా పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో మండల వనరుల కేంద్రం సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. నవాజ్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, దేవయ్య, రాజశేఖర్, రూప పాల్గొన్నారు.

### పాముకాటుతో వృద్ధురాలు మృతి

నిజాంపేట, ఏప్రిల్ 28: పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాపూర్(కె)లో ఆలస్యంగా వెలుగు చూసింది. జనగామ బాలవ్వ(65) ఇంటివద్ద నాగుపాము కాటేసింది. దీంతో బాలవ్వ అపస్మారక స్థితిలోకి వెళ్లి, మృతి చెందింది.

### గర్భిణులకు ప్రత్యేక చికిత్సలు

రామాయంపేట, ఏప్రిల్ 28: డీ.ధర్మారం పీహెచ్‌సీలో గర్భిణులకు ప్రత్యేక చికిత్సలు నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు హరిప్రియ తెలిపారు. సోమవారం డీ.ధర్మారం పరిధిలోని నిజాంపేట, రామాయంపేట మండలాలకు చెందిన గర్భిణులు చికిత్సలు చేసుకోవాలన్నారు. ఎత్తు, బరువు, రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతి సోమ, మంగళవారాలు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**LOST**

★I, TUNGA PRABHAKAR REDDY, S/o. Late Purushottam Reddy, R/o. A-12/1, AFOCHS, Sainikpuri, Hyderabad on 23-03-2025, while travelling at Narsapur Chourasta of Toopran Town, I Lost my Original Sale Deed Doc.No. 15607/2005 including my Wife's Tunga Pushpaleela Original Sale Deed Doc.No. 15604/2005, 15605/2005 and also my Daughter's Trinitha Reddy Original Sale Deed Doc.No. 15606/2005. If found, please Contact: 7842543555.
NT-00460

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.